క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి పూజలు

నింద్ర: మండలంలోని నింద్ర క్రాస్ రోడ్డు వద్ద ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళనాడులోని చెన్నైకు చెందిన భక్తులు తిరుమలకు కాలినడకన బయల్దేరారు. మార్గమధ్యలోని నింద్ర క్రాస్ వద్ద శ్రీవేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులు తిరుమలకు బయల్దేరారు.

30న ఎక్సైజ్ వాహనాల వేలం

నగరి: వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు ఈ నెల 30వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హీరో స్ప్లెండర్‌ప్లస్ వాహనాలు రెండు రిజిస్ట్రేషన్ కలవి, ఒకటి రిజిస్ట్రేషన్ లేనిది నడిపే విధంగా ఉన్నవి మూడు, హోండా డియో స్కూటీ రిజిస్ట్రేషన్ లేని స్క్రాప్ ఒకటి వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ప్రభుత్వం వారు నిర్ణయించిన ధరలో 10 శాతం ధరావత్తు సొమ్మును ముందుగా చెల్లించాలన్నారు. వేలంలో దక్కించుకున్నవారు చలానాతోపాటు జీఎస్టీ చెల్లించి వాహనం స్వాధీనం చేసుకోవాలన్నారు. అలా చేయకుంటే కట్టిన ధరావత్తు వదులుకోవాలని, అది ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుందన్నారు. వేలంలో వాహనం దక్కని వారికి ధరావతు సొమ్మును తిరిగి ఇస్తామన్నారు. అనివార్య కారణాలతో వేలంపాట వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు ఆక్షన్ అథారిటీ వారికి పూర్తి అధికారం ఉంటుందన్నారు.

ఘనంగా ఆయుధపూజ


ఆయుధ పూజలో పాల్గొన్న సీఐ శ్రీనివాసంతి, పోలీసు సిబ్బంది

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం నాడు ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. సీఐ శ్రీనివాసంతి స్టేషన్ సిబ్బందితో కలిసి భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజల సమస్యలను తీర్చడంలో పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు.

వరసిద్ధుడి సేవలో పాట్నా హైకోర్టు జడ్జి

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. దగ్గర ఉండి స్వామివారి దర్శనం కల్పించారు. వేద ఆశీర్వచనంతో పాటు ఏఈఓ కృష్ణారెడ్డి ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన నిత్యాన్నదానానికి ఓ దాత నగదు విరాళం చేశారు. ఆదివారం బెంగళూరుకు చెందిన రవికాంత్ కాణిపాకం ఆలయానికి వచ్చారు. అనంతరం నిత్యాన్నదానానికి రూ.లక్ష నగదును ఆలయ అధికారులకు విరాళం అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి దర్శనం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చీకటి వెలుగుల దీపావళి



నగరిలో టపాకాయల దుకాణాలు

- మండుతున్న బాణసంచా ధరలు
- పూజా సామగ్రి ధరలకు రెక్కలు
- ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకులు
- భారంగా పండుగకు సిద్ధమవుతున్న జనం

నగరి: దీపావళి.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. వెలుగుల పండుగకు నగరి నియోజకవర్గంలోని మార్కెట్లు సిద్ధమయ్యాయి. పూజాసామగ్రి, బాణసంచా, నిత్యావసర సరుకుల కొనుగోలుదారులతో మార్కెట్లు సందడిగా మారాయి. అయితే పూలు, పూజ సామగ్రి, బాణసంచా ధరలు మండుతుండడం.. ఈ ఏడాది దీపావళిని కొంతభారంగా జరుపుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. వివిధ రకాల టపాసులు, ప్రమిదలు, సీరియల్ లైటింగులు, లక్ష్మీదేవి పూజకు పూలు కొనుగోలు చేసే వారితో దుకాణాల వద్ద ఆదివారం సందడి నెలకొంది. అయితే అన్నింటి ధరలు మండుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

మొదలైన టపాసుల అమ్మకాలు

నియోజకవర్గంలో టపాసుల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. నివాస ప్రాంతాలకు దూరంగా కుశస్థలి నది సమీపంలోని మైదానంలో 10 దుకాణాలు, పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 7 దుకాణాలు, వడమాలపేట మండలంలోని ఎస్‌ఆర్‌టీ కల్యాణ మండపం సమీపంలో నాలుగు దుకాణాలు ఏర్పాటు చేశారు. టపాసుల కొనుగోలుకు యువకులు ఆసక్తి చూపారు. గతేడాది దీపావళికి వర్షాలు ఎక్కువగా రావడంతో టపాసులు అమ్ముడు పోక వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఆ లోటును భర్తీ చేసుకునేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. వ్యాపారులు ఎంత గొప్పగా అఫర్లు ఇచ్చినా గతేడాది రెండు, మూడు వేల రూపాయలకు వచ్చిన సామగ్రి ఈ ఏడాది నాలుగైదు వేల రూపాయలు పెడితేగాని రావడం లేదని పలువురు వాపోతున్నారు. దీనికి తోడు నిత్యావసర సరుకులు కూడా అదే రీతితో మండుతున్నాయి. కొబ్బరికాయ ధర సైజును అనుసరించి రూ.40 నుంచి రూ.60 పలుకుతోంది. చిన్నదిగా ఉన్న టెంకాయ కొందామన్నా రూ.30కి తక్కువ రావడం లేదు. పండుగ కావడంతో పువ్వుల ధరలు పెరిగాయి. పిండి వంటలు తయారు చేసుకోవడానికి అవసరమైన నిత్యావసర సరకుల ధరలు ఇప్పటికే పెరిగాయి. దీంతో చీకటి వెలుగులు నడుమ దీపావళి పండగను జరుపుకోవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

టపాసులు.. జాగ్రత్తగా కాల్చాలి



అమ్మకానికి సిద్ధంగా టపాసులు, పేలుతున్న చిచ్చుబుడ్లు

పాలసముద్రం: చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ఆనందోత్సాహాలతో నిర్వహించుకునే దీపావళి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకోనున్నారు. దీపావళి సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం తప్పదు. దీపావళి ప్రతి ఇంటా ఆనందాల కాంతులు వెదజల్లాలంటే జాగ్రత్తలు తప్పనిసరి. మరోవైపు బాణసంచా తయారీదారులు, దుకాణదారులు సైతం అజాగ్రత్తగా వ్యవహరించడానికి వీల్లేదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నిబంధనలు

బాణసంచా విక్రయించే వ్యాపారులు ముందుగా పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారుల నుంచి అనుమతులు పొందాలి. జనసంచారం లేని, ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకోవాలి, విక్రయ ప్రాంతంలో తప్పనిసరిగా ఇసుక, నీరు, కార్బన్‌డయాక్సైడ్ వాయువులను అందుబాటులో ఉంచుకోవాలి. దుకాణాల సమీపంలో ఎవరూ సిగరెట్లు, బీడీలు కాల్చకుండా పొగ తాగరాదని సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలి. అలాగే దుకాణాల సమీపంలో ఎవరూ సెల్‌ఫోన్‌లో మాట్లాడకుండా చర్యలు తీసుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి

గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాలు, గడ్డివాములు, పూరిగుడిసెలు ఎక్కువగా ఉంటాయి. అక్కడ రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు కాల్చకూడదు. ప్రధానంగా టపాసులు కాల్చేటప్పుడు పిల్లల విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా జీవితకాలం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే పెద్దల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చేలా చూసుకోవాలి. అలాగే నియోజకవర్గంలో సుమారు 55 బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు కానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

టపాసులు కాల్చే సమయంలో ముఖ్యంగా పేలుళ్లు, ఎక్కువగా మందుగుండు సామగ్రి కాల్చేటప్పుడు సాధ్యమైనంత దూరంగా ఉండి వాటిని వెలిగించాలి. లేకుంటే గాయాలు కావడం గానీ, చెవికి సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. టపాకాయలు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి.

–విక్రమ్, సీఐ, నగరి

ప్రమాదాలపై వెంటనే ఫోన్ చేయాలి

ఎక్కడ అగ్నిప్రమాదం జరిగినా వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించాలి. చేతితో పట్టుకొని టపాకాయలు కాల్చరాదు. సగం కాలిన టపాకాయలను నిర్లక్ష్యంగా వదిలి వేయరాదు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు వైర్ల వద్ద కాల్చకూడదు. దురదృష్టవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక సిబ్బందికి 99637 37024, 08677 236122 నెంబర్లకు తెలిజేయాలి.

–సుబ్బరాజు, ఫైర్ ఆఫీసర్, నగరి

నిబంధనలు పాటించాలి

బాణసంచా విక్రయించే వ్యాపారులు ముందుగా పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్ తదితర అన్ని శాఖల అధికారుల నుంచి అనుమతి పొందాలి. తరువాతనే జనసంచారం, ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణం పెట్టాలి. దుకాణం ప్రాంతంలో కార్బన్‌డయాక్సైడ్ వాయువు ఉంచుకోవాలి.

– అరుణకుమారి, తహశీల్దార్

అప్రమత్తంగా వ్యవహరించాలి

ప్రమాదాలనేవి ప్రారంభంలో చిన్నవిగానే ఉంటాయి. అందుకే బాణసంచా విషయంలో ఏ చిన్న ప్రమాదం జరిగినా అప్రమత్తంగా వ్యవహరించాలి. అందుబాటులో ఉన్న వనరులతో ప్రమాదాన్ని నివారించేందుకు ప్రయత్నించాలి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి.

–ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప, పాలసముద్రం

జాగ్రత్తలు పాటించాలి

టపాసులు కాల్చే సమయంలో ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా ఆరుబయటే టపాసులు కాల్చాలి. ఇరుకు ప్రదేశాల్లో కాలిస్తే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. కాటన్ దుస్తులు ధరించాలి. టపాసుల విక్రయదారులు కూడా జాగ్రత్తలు పాటించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. దుకాణాల మధ్య దూరం ఉండాలి. నీళ్ల డ్రమ్ములు, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని సూచించాం.

–హనుమంతప్ప, కార్వేటినగరం సీఐ

రోడ్డు గుంతలమయం


గుంతలుగా ఉన్న చవరంబాకం రోడ్డు

నింద్ర: మండలంలోని చవరంబాకం గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షం పడితే చాలు పూర్తిగా బురదతో నిండిపోతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు గుంతలు కనిపించకుండా ప్రమాదాల పాలవుతున్నారు. అదే విధంగా రాత్రి సమయంలో రోడ్డుపై వెళ్లడానికి భయాందోళన చెందుతున్నారు. గుంతలు కనిపించకుండా పోవడంతో మహిళలు గుంతలో పడిపోయే ప్రమాదం ఉంది. ఈ రోడ్డు సమస్యను అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. అదే విధంగా నింద్ర నుండి మిట్టూరు గ్రామానికి వెళ్లే రోడ్డు కూడా గుంతలుగా మారింది. గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మరమ్మతులు చేయాల్సి ఉంది.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు


వాలీబాల్ పోటీల్లో ముఖ్య అతిథులు, క్రీడాకారులు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం వాలీబాల్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి ఎంసీ బాబురెడ్డి, జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వానికి సంబంధించిన యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించామన్నారు. మై భారత్ తరఫున యువతకు అందిస్తున్న సదుపాయాలను క్రీడాకారులకు వివరించారు. వాలీబాల్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అవుతారని తెలిపారు. రాయలసీమ యూత్ అసోసియేషన్ ఫర్ సేవతో కలిసి నిర్వహించిన ఈ వాలీబాల్ పోటీల్లో 9 జట్లు పాల్గొన్నారు. ఇందులో పురుషుల విభాగంలో గంగాధరనెల్లూరు యూత్ ప్రథమ స్థానం, స్త్రీల విభాగంలో కృష్ణవేణి జూనియర్ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచాయి. గెలిచిన క్రీడాకారులకు క్రీడా సామగ్రి, బంగారు పతకంతోపాటు ధ్రువపత్రాలను అతిథులు అందజేశారు. రాయలసీమ యూత్ అసోసియేషన్ ఫర్ సేవా ప్రెసిడెంట్ ఎస్.నిత్యానందం, ఎంపైర్ రాజేష్, వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడలు గ్రామీణ యువతకు దిక్సూచిగా ఉపయోగపడుతాయని జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రేపు పల్లమాలలో కోటి సంతకాల సేకరణ

బుచ్చినాయుడుకండ్రిగ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలల్లో 10 కళాశాలలను ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ఉద్యమం చేపడుతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొణతనేని మణినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు పల్లమాల గ్రామంలో కోటి సంతకాల సేకరణను, రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. దీనికి తిరుపతి ఎంపీ మద్దిలగురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటిరాజేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బీఆర్వీ అయ్యప్పన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీమంత్రి ఆర్కే రోజా దంపతులు, ఆంబ్రోస్ విల్సన్ కుటుంబీకులకు పరామర్శ

నగరి: ఆప్తులను కోల్పోయి బాధ పడుతున్న కుటుంబాలను ఆదివారం మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. వైఎస్‌ఆర్ సీపీ నగరి మున్సిపల్ మాజీ అధ్యక్షుడు బీఆర్‌వీ అయ్యప్పన్ తండ్రి బీఆర్‌వీ వరదప్ప మొదలియార్ ఇటీవల మృతి చెందారు. వారి స్వగృహానికి వెళ్లిన మాజీ మంత్రి ఆర్కే రోజా, ఆమె భర్త ఆర్కే సెల్వమణి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వరదప్పన్ మొదలియార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆంధ్ర రాష్ట్ర ఏఐఏడీఎంకే కార్యదర్శి ఆంబ్రోస్ విల్సన్ కుమారుడు వినోద్ ఇటీవల మృతిచెందాడు. ఆయన కర్మక్రియలకు హాజరైన మాజీ మంత్రి ఆర్కే రోజా దంపతులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం 13వ వార్డు చెందిన పార్టీ మున్సిపల్ కార్యదర్శి బాలాజీ తల్లి ఉమ ఇటీవల మృతిచెందగా ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైఎస్‌ఆర్ సీపీ మున్సిపల్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు మునివేలు, నాయకులు బాలకృష్ణన్, కన్నాయిరం, ఇంద్రయ్య, మురుగయ్య, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ముప్పు



ప్రమాదానికి గురైన గ్యాస్ లారీ, పూర్తిగా దెబ్బతిన్న కూరగాయల లారీ

వడమాలపేట (పుత్తూరు): తిరుపతి నుంచి చెన్నైకి వెళ్తున్న గ్యాస్ లారీని వెనక నుంచి కూరగాయల మినీలారీ బలంగా ఢీకొన్న ఘటన ఆదివారం వడమాలపేట అంజేరమ్మ కనుమ వద్ద చోటు చేసుకొంది. దీంతో గ్యాస్ లీక్ అయ్యి అగ్ని ప్రమాదం సంభవిస్తుందని ఇతర వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురయ్యారు. సమీప టోల్ ప్లాజా వద్ద నుంచి వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో కూరగాయల మినీలారీ ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా డ్రైవర్ ప్రాణాలతో బయట పడ్డాడు. గాయపడ్డ డ్రైవర్‌ను పోలీసులు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు వడమాలపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలుషిత మేతతో పాడికి ముప్పు

గ్రాసం కొరత రైతులను పట్టిపీడిస్తున్న తరుణంలో కలుషిత మేతలతో పశు పోషణ భారంగా మారింది. సాధారణంగా గ్రాసం కోసం ఇటు పశుపోషకులు, అటు గొర్రెలు, జీవాల పెంపకందారులు వాటిని మేతల కోసం పొలాల్లోకి తీసుకెళ్తుంటారు. అక్కడ రకరకాల కలుషిత మొక్కలు ఉంటాయి. అలాగే పొలాల్లో పంటల సంరక్షణకు రసాయన మందులు స్ప్రే చేసి ఉంటారు. ఆ పైరుల్లో నీటిని తాగినా కూడా పశువులు ఒక్కోసారి ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులు, జీవాల పోషకులు జాగ్రత్తలు పాటించాల్సి ఉంది.


బొమ్మన్‌దొడ్ల సమీపంలో పంట పొలాల్లో ఏపుగా పెరిగిన కలుషిత మొక్కలు


గడ్డి మేస్తున్న పాడి ఆవులు

- పురుగు మందులు చల్లిన గడ్డి తింటే పశువులకు ప్రమాదం
- విష ప్రభావంతో మృతి చెందే అవకాశం
- ముందు జాగ్రత్తలతోనే పాడి సంరక్షణ

వెదురుకుప్పం: సాధారణంగా పంటలను రక్షించుకునేందుకు రైతులు రసాయన ఎరువులు వాడుతుంటారు. దాని వల్లపొలాల్లో విషపూరిత ప్రభావం ఉండే అవకాశం ఉంది. ఆ రసాయనాలు కొట్టిన గడ్డి, ఇతరత్రా వాటిని తిన్న పశువులు విషప్రభావం బారిన పడుతుంటాయి. ఎక్కువగా పురుగు మందులు చల్లిన గడ్డిని మేస్తే మృత్యువాత పడే ప్రమాదం ఉందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. మండలంలో అనేక చోట్ల కలుషిత మొక్కలు ఏపుగా పెరిగిపోతున్నాయి. వెదురుకుప్పం, సీఆర్‌కండ్రిగ, పచ్చికాపల్లం, కొణంగిపల్లె, మాంబేడు, గొల్లపల్లె, పెద్దపోటు చేను, పాతగుంట ప్రాంతాల్లో విషపూరితమైన వయ్యారిభామ మొక్కలు విపరీతంగా పెరిగి తోటలను తలపిస్తున్నాయి. ఈ మొక్కల ద్వారా ఇటు పశువులకు అటు మనుషులకు హాని కలిగే అవకాశం ఉంది.

పశువుల్లో విష ప్రభావం..

కలుషిత గడ్డిని తినడం ద్వారా పశువులు హఠాత్తుగా మేత మేయకుండా పడిపోతాయి. పశువుల పొట్ట ఉబ్బిపోతుంది. పశువుల్లో జీర్ణ వ్యవస్థ మందగిస్తుంది. నల్లగా విరేచనాలు అవుతాయి. నోటిలో చొంగ కారి కాళ్లు వణికిపోతాయి. తల, కాళ్లతో కొట్టుకుంటాయి. ఈ లక్షణాలతో పశువులు అనారోగ్యానికి గురై నాలుగైదు రోజుల్లో మత్యువాత పడే ఆస్కారం ఉంది. పాడి రైతులు నిర్లక్ష్యం వహిస్తే నష్టాల పాలవ్వాల్సి వస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

రసాయన ఎరువులు చల్లిన తరువాత వరిచేనులో నీటిని జీవాలు తాగకుండా చూసుకోవాలి. ఒకవేళ జీవాలు తాగితే కడుపులో మంట ఏర్పడి గట్టిగా అరుస్తాయి. ఈ స్థితిలో అట్రోఫిన్ సల్ఫేట్ సెలైన్ ద్రావణాన్ని పశువుల రక్తంలోకి ఎక్కించాలి. ఈ మందు అందుబాటులో లేకపోతే కర్ర బొగ్గును మెత్తగా పొడిచేసి రెండు లీటర్ల నీటిలో కలిపి తాగించాలి. లేదా కోడి గుడ్డు తెల్లసొనను తాగిస్తే కొంతవరకు ఉపశమనం లభిస్తుంది. విష ప్రభావానికి గురైన పశువులను వెంటనే వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి. పశువును పరిశీలించి చికిత్సలు చేయించాలి. ముఖ్యంగా ఊపిరితిత్తులు, కాలేయం విష ప్రభావానికి గురి కాకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. పాడి ఆవుల్లో సైతం పాల దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. మంచి ఆహారం, పోషక విలువలు గల గడ్డిని ఇవ్వడం ద్వారా పోషణ లాభదాయకంగా ఉండడంతో పాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. పాతర గడ్డి, మినరల్ మిక్చర్ వంటి పోషక విలువలు గల ఆహారం శ్రేయస్కరం.